క్లుప్తంగా

నూతన సచివాలయం ప్రారంభం



ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : సచివాలయాలు జగనన్న మానస పుత్రికలు అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్‌లో గల సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం జనతాబజార్ వద్ద ఉన్న కమ్యూనిటీ హాలుకు రూ. 12.50 లక్షలతో మరమ్మతులు చేయించి సచివాలయంగా తీర్చిదిద్దామన్నారు. ప్రజలు ఈ సచివాలయ సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్, అధ్యక్షుడు విల్లూరి భాస్కరరావు, అలపన కనకరెడ్డి, మండల ప్రెసిడెంట్ నీలకంఠం, జీవీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల కంటి సమస్యల నివారణపై శిక్షణ

మహారాణిపేట : కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు రేటినోపతి ఆఫ్ ప్రీ మెచ్యూరిటీ సమస్యపై కేజీహెచ్ పిల్లల వార్డులో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.వి.సమత పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. తక్కువ బరువు, నెలలు నిండకుండా పుట్టిన చిన్నారుల్లో కంటి లోపలి పొర సమస్యల బారిన పడకుండా కాపాడాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో పలువురు వైద్యులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

డాక్టర్ చీటీ లేనిదే యాంటీ బయోటిక్స్ వాడరాదు

మహారాణిపేట : కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. యాంటీ మైక్రోబయల్ వారోత్సాల సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. సత్యం కూడలి మీదుగా బయలుదేరిన ర్యాలీ తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే యాంటీ బయోటిక్స్ ఇవ్వకూడదని, రోగులు వాడకూడదని తెలిపారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సయ్యద్ బేగం, రవి శంకర్, నాయుడు, బి.నాగభూషణం, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

బాక్సర్‌కు అభినందన

దాబాగార్డెన్స్ : ఇటీవల జరిగిన స్టేట్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలో బంగారు పతకం సాధించిన 31వ వార్డు కనకలవీధికి చెందిన బి.వంశీని వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తిన నవీన్‌కుమార్ శుక్రవారం అభినందించారు. మేఘాలయలో జరగనున్న నేషనల్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీకి అర్హత సాధించిన నేపథ్యంలో వంశీని ప్రోత్సహిస్తూ పోటీలో పాల్గొనేందుకు ప్రయాణ ఖర్చులకు రూ.5 వేలు అందజేసి బెస్టాఫ్ లక్ చెప్పారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

వేడుకగా దీపారాధన



దీపారాధనలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం : నేరెళ్లకోనేరు ప్రాంతంలో గల శ్రీ సిరి వినాయక దేవాలయం 21వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం దేవాలయం వద్ద నిర్వహించిన దీపారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. షిర్డీ సాయిబాబా ఆకారంతో రంగవల్లులు తీర్చిదిద్ది, చుట్టూ దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా గణపతి పూజతో పాటు సాయి నామస్మరణతో ఆ ప్రాంతం పులకించిపోయింది. ఆలయ అధ్యక్షుడు రమేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జగదాంబ బస్‌బే ఆధునికీకరణకు అయిన ఖర్చు **25.93** లక్షలు	ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద బస్‌బే ఆధునికీకరణకు అయిన ఖర్చు **26.33** లక్షలు	ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద గల బస్‌బే ఆధునికీకరణకు అయిన ఖర్చు **24.73** లక్షలు	లలితా జ్యూయలరీ వద్ద గల బస్‌బే ఆధునికీకరణకు అయిన ఖర్చు రూ.**26.45** లక్షలు

బ్యూటీఫుల్‌గా.. బస్‌బేలు

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సౌకర్యార్థం నూతన బస్‌బేలు నిర్మింపజేశారు. పాత వాటిని అత్యద్భుతంగా ఆధునికీకరించారు. ఒక్కో బస్‌బే నిర్మాణానికి దాదాపు రూ. 25 లక్షల నుంచి 30 లక్షల వరకు వెచ్చించారు. ప్రయాణికులు కూర్చునేందుకు సిమెంట్ దిమ్మలు, రాత్రివేళ ఇబ్బంది లేకుండా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడంతో బస్‌బేలు చూడముచ్చటగా ఉన్నాయి.

- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు
- సౌకర్యవంతంగా ఉన్నాయని కితాబు
- సదుపాయాల పట్ల ఖుషీ



ఇది కదా అభివృద్ధి



ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద ఆధునికీకరించిన బస్‌బేలో ప్రయాణికులు

నాడు

ప్రయాణికులకు అప్పట్లో సరైన సదుపాయాలు ఉండేవి కాదు. శిథిలమైన బస్టాపులు, వర్షం వస్తే కారే బస్టాండ్లతో ప్రజలు ఇక్కట్లు పడేవారు. చాలా చోట్ల అసలు బస్టాప్‌లే ఉండేవి కాదు. చెట్ల కింద, షాపుల ముందు ప్రజలు బస్సుల కోసం పడిగాపులు పడేవారు. ఎండకి ఎండి, వానకి తడిసి ఇబ్బందులు పడేవారు. పొద్దుగూకితే బస్టాపులు విద్యుత్ సౌకర్యం లేక చిమ్మచీకట్లలోకి జారుకునేవి. బిచ్చగాళ్లు, ఆకతాయిలు బస్టాపులను ఆక్రమించుకునే వారు. ఆకతాయిలు బస్టాపులో వేచి చూసే మహిళలను ఇబ్బంది పెట్టేవారు. ఇప్పుడు ప్రభుత్వం ఆధునికీకరించిన నూతన బస్‌బేల వల్ల అటువంటి సమస్యలకు చెక్ పడింది.

నేడు

పేద, సామాన్య ప్రజల సంక్షేమానికి పాటు పడుతున్న జగనన్న ప్రభుత్వం అభివృద్ధిలో భాగంగా ఆధునిక బస్‌బేలు నిర్మించింది. చక్కటి విద్యుత్, కూర్చునేందుకు సిమెంట్ దిమ్మలు బస్‌బేల్లో ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూసేందుకు ఎలాంటి ఇబ్బంది పడటం లేదు.

బస్టాప్‌లు బాగున్నాయి..



ఒకప్పుడు బస్టాప్‌లు బాగుండేవి కావు. వర్షం వస్తే కారిపోయేవి. అంతేకాదు అపరిశుభ్రంగా ఉండేవి. ప్రస్తుతం విశాఖ మహానగరంలో బస్టాప్‌లు బాగా ఆధునికీకరిస్తున్నారు. వారంలో రెండు మూడు సార్లు కొమ్మాది మా బంధువు ఇంటికి వెళ్తుంటాం. జగదాంబ జంక్షన్ బస్టాప్ వద్దే బస్సు ఎక్కుతుంటాం. ఈ బస్టాప్‌లో కూర్చునేందుకు సిటింగ్ బాగుంది. విద్యుత్ లైట్లు వెలుగుతున్నాయి.

ఎ. రమణ, అల్లిపురం

విదేశాల్లో ఉన్నట్లుంది..



ఒకప్పటి కంటే ఇప్పుడు ఆధునికీకరించిన బస్టాప్‌లు చూడముచ్చటగా ఉన్నాయి. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. బస్టాప్‌లు చూస్తుంటే విదేశాల్లో ఉన్నట్టు ఉంది. బాగా అభివృద్ధి చేస్తున్నారు. ఎండ, వర్షం బాధ లేకుండా బస్సుల కోసం ప్రశాంతంగా వేచి చూడొచ్చు. రాత్రి వేళ కూడా ఎలాంటి భయం లేకుండా బస్‌బేలో వేచి ఉండేందుకు అనువుగా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడం బాగుంది.

వేచలపు లక్ష్మి, పూర్ణామార్కెట్



ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద బస్‌బే



లలితా జ్యూయలరీ బస్టాప్



ఆధునికీకరించిన బస్‌బేను ప్రాంభిస్తున్న మేయర్, ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్ (ఫైల్)



జగదాంబ జంక్షన్ బస్టాప్‌ను ప్రారంభిస్తున్న మేయర్, ఎమ్మెల్యే తదితరులు (ఫైల్)

దాబాగార్డెన్స్ : నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో బస్ బేలు అత్యాధునికంగా ఆధునికీకరించారు. జగదాంబ జంక్షన్, ఎల్ఐసీ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్, లలితా జ్యూయలరీ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం బస్ బేలు ఏర్పాటయ్యాయి. జగదాంబ జంక్షన్ వద్ద రూ.25.93 లక్షలు, ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద రూ.26.33 లక్షలు, ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద రూ.24.73 లక్షలు, లలితా జ్యూయలరీ వద్ద రూ.26.45 లక్షలతో బస్సు బేలు ఆధునీకరించి అందుబాటులోకి తెచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో విశాఖ నగరం అభివృద్ధి చెందుతోంది. సీఎం సూచనల మేరకు ఇప్పటికే పలు బస్ బేల నిర్మాణం జరిగింది. త్వరలో విశాఖ నగరం పరిపాలన రాజధాని కాబోతున్న నేపథ్యంలో నగరంతో పాటు బస్‌బేలు కూడా ఆధునీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యార్థులు.. ప్రయాణికుల సౌకర్యార్థం..

ప్రయాణికులు, పాఠశాల పిల్లల సౌకర్యార్థం నగరంలోని పలు బస్టాండ్‌లు ఆధునికీకరించారు. నియోజకవర్గ పరిధిలో జగదాంబ జంక్షన్, ఎల్ఐసీ బిల్డింగ్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్, లలితా జ్యూయలరీ వద్ద గల బస్‌బేలు ఆధునికీకరించి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో విశాఖ నగరం అభివృద్ధి చెందే నేపథ్యంలో బస్‌బేలు అత్యాధునికంగా రూపొందిస్తున్నారు. త్వరలోనే విశాఖ నగరం పరిపాలన రాజధాని కానున్న నేపథ్యంలో బస్‌బేలు అవసరమని భావించి జీవీఎంసీ చర్యలు చేపట్టింది.

సీఎం జగన్‌తోనే సంక్షేమం



బురుజుపేట సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



బురుజుపేట సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

- బురుజుపేట సచివాలయం పరిధిలో రూ.20.24 కోట్ల లబ్ధి
- రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి మళ్లీ జగనే సీఎం కావాలి
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : జగనన్న పాలనలో పేదవారికి ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 36, 38 వార్డుల్లో గల బురుజుపేట సచివాలయం పరిధిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా బురుజుపేట సచివాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. 36,38 వార్డుల సచివాలయాల పరిధిలో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) కింద రూ.11 కోట్ల 4 లక్షలు, పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) కింద రూ.9 కోట్ల 20 లక్షలు కలిపి మొత్తంగా రూ.20 కోట్ల 24 లక్షల లబ్ధి అర్హులైన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, అవ్వాతాతలకు ఎలాంటి వివక్ష లేకుండా అందజేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పథకాల ద్వారా అర్హులైన పేదలందరికీ డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.4,69,459.45 కోట్లు అందజేయడం ఆనందదాయకమన్నారు. ప్రజలు గత ప్రభుత్వ పాలనకు, నేడు జగనన్న సుపరిపాలనకు మధ్య గల వ్యత్యాసాన్ని బేరీజు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొల్లి సింహాచలం, క్లస్టర్ ఇన్‌చార్జి సనపల రవీంద్ర, కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టీ బెహరా వెంకటరత్నం, ఎంబర్ మన్నార్ ఆలయ చైర్మన్ టీకే ప్రసాద్, పెదవాడ బాబ్జి, టీఎల్ఎఫ్ సెక్రటరీ రమణమ్మ, సాగర్, చిన్న కృష్ణ, జోనల్ కమిషనర్ శివప్రసాద్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, సీవోలు, ఆర్పీలు, ప్రజలు పాల్గొన్నారు.

టౌన్ కొత్తరోడ్డు సచివాలయం పరిధిలో..

జగదాంబ : సుపరిపాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నడిపిస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్తరోడ్డు 204 సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన జెండా ఎగురవేసి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల సీఎం జగనన్న పాలనలో టౌన్ కొత్తరోడ్డు సచివాలయం ద్వారా రూ. 22.06 కోట్లు లబ్ధి చేకూర్చారన్నారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అందుకే మళ్లీ జగనే సీఎం కావాలని ఎమ్మెల్యే వాసుపల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, అలపన కనకరెడ్డి, మండల ప్రెసిడెంట్ నీలకంఠం, సిటీ సెక్రటరీ ఆదివిష్ణు, మంగరాజు, గౌరీశంకర్, సుబ్రహ్మణ్యం, వరలక్ష్మి, బోనిదేవా, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, జీవీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



టౌన్‌కొత్తరోడ్డు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

నూతన హంగులతో గోకుల్ పార్క్



పార్క్‌లో చేపట్టిన పనులను పరిశీలిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి తదితరులు

దాబాగార్డెన్స్ : బీచ్‌రోడ్డులో గల గోకుల్ పార్క్‌ను నూతన హంగులతో అలంకరించారు. కార్తీక పౌర్ణమి రోజున యాదవ కులస్తులంతా గోకుల్ పార్క్ వద్ద రాధాకృష్ణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. రాధాకృష్ణ మహోత్సవం సందర్భంగా ఈ పార్క్‌ను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పార్కుకు విద్యుత్ అలంకరణ, పారిశుధ్యం, మొబైల్ టాయ్‌లెట్స్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఎంహెచ్‌వో రాజేష్, కార్యనిర్వాహక ఇంజినీర్లు శేఖర్, దిలీప్, ప్రజారోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు న్యాయవాదుల సమావేశాలు

విశాఖ-లీగల్ : అఖిల భారత న్యాయవాదుల సంఘం జాతీయ కార్యవర్గ సమావేశం శనివారం విశాఖలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.ఎస్.ఎస్.సురేష్ కుమార్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. తొలిసారిగా విశాఖలో జాతీయ స్థాయి కార్యవర్గ సభ్యుల సమావేశాన్ని విశాఖలో నిర్వహిస్తున్నామన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి

అల్లిపురం : సత్యసాయిబాబా 98వ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అల్లిపురం కర్ణాల వీధిలో గల శిష్టకర్ణ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల కోలాటంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో శిష్టకర్ణ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎన్.కె.మహంతి, ప్రధాన కార్యదర్శి మంత్రి నరసింహమూర్తి, రమేష్, బుజ్జి, ప్రవీణ్, ప్రశాంతి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు ఉండాలి

అల్లిపురం : బీసీలకు పొలిటికల్ రిజర్వేషన్లు ఉండాలని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ జనగణన జరగాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సెన్సస్ నిర్వహిస్తామన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన బీసీ కుల గణనపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ఆర్థిక, సాంఘిక సమానత్వం కావాలన్నారు. బీసీల్లో ఐక్యత అవసరమని అభిప్రాయపడ్డారు.

ఆకట్టుకున్న బంతిపూల గౌరమ్మ



గౌరమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టపై శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారి సన్నిధిలో మహిళలు బంతిపూల గౌరమ్మను చక్కగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని మధ్యలో ఉంచి మహిళలు అమ్మవారి చుట్టూ తిరుగుతూ పాటలు పాడి సందడి చేశారు. మహిళల కోలాటం చూపరులను ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌పై విద్యార్థులకు అవగాహన



ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన కల్పిస్తున్న నేవీ అధికారి

దొండపర్తి: అగ్నివీర్ పథకంపై పాఠశాలల విద్యార్థులకు తూర్పు నావికాదళం అధికారులు శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, విశాఖ వ్యాలీ స్కూల్‌లో విద్యార్థులతో పాటు 6(ఏ) ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ యూనిట్‌లో క్యాడెట్లకు అగ్నివీర్ స్కీమ్ ద్వారా కలిగే అవకాశాలను వివరించారు.

బోట్లకు నష్టపరిహారానికి వినతి



జామియా మసీదు వద్ద మత్స్యకారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



34వ వార్డులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, పద్మావతి

- ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లికి మత్స్యకారుల వినతి

అల్లిపురం/మహారాణిపేట : తుపాన్లలో మునిగిపోయి, తీవ్రంగా డ్యామేజ్ అయిన బోట్లకు నష్టపరిహారం చెల్లించాలని సుమారు 40 మంది మత్స్యకారులు జామియా మసీదు వద్ద శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. వారి సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొల్లి సింహాచలం, పీతల వాసు, మాసిపోగు రాజు, నొల్లి పోతుస్వామి, ముజీబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. 34వ వార్డు అచ్చియ్యమ్మపేట జంక్షన్‌లో గల వైఎస్సార్ విగ్రహం వద్ద జరిగిన ప్రజాదర్బార్‌లో కూడా ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ తోట పద్మావతి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దొడ్డి బాపు ఆనంద్, లింగం శ్రీనివాస్, లండా రమణ, వాసుపల్లి నారాయణ, దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.